క్లుప్తంగా

స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలి



రాచర్ల: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ హి సేవ పక్షోత్సవాలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు పక్షోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంఈఓ-1 శివకోటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం రమేష్, ఏపీఎం మోషే, ఈఓఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగం నేరం



మాట్లాడుతున్న ఏడీఈ శేషగిరిరావు

రాచర్ల: అక్రమంగా విద్యుత్ వాడటం చట్టరీత్యా నేరమని ఆ శాఖ ఏడీఈ శేషగిరిరావు పేర్కొన్నారు. శుక్రవారం రాచర్ల మండలంలోని పలు గ్రామాల్లో విజిలెన్స్ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. అనంతరం అనుములపల్లె సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏడీఈ మాట్లాడారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 22 మందిపై కేసులు నమోదే చేసి రూ.1.25 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం విద్యుత్ శాఖ ఈఈ పి.నాగేశ్వరరావు, రాచర్ల ఏఈ బాల గురవయ్య, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



రాచర్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

రాచర్ల: వాహనదారులు ధ్రువీకరణ పత్రాలతో పాటు లైసెన్స్‌ను వెంట ఉంచుకోవాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు.

నాటుసారా బట్టీ ధ్వంసం



బట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ సురేష్‌యాదవ్

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ శివారులోని వాగు సమీపంలో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను స్థానిక సీఐ కె.సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది ధ్వంసం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో సీఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బట్టీ వద్ద ఉన్న రామయ్య, బచ్చాసాబ్‌ను అదుపులోకి తీసుకుని, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

దర్శి: దర్శి పట్టణంలోని కనకదుర్గమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామాభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఉప్పలపాడులో మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

మార్కాపురం టౌన్: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహార ప్రాధాన్యతను తల్లులు, గర్భిణులకు వివరించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. సూపర్‌వైజర్లు పద్మావతి, రమాదేవి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరన్ లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బేస్తవారిపేట: గర్భిణులు ఐరన్ పుష్కలంగా లభించే ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలక్ష్మి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పిటికాయగుళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. పోషకాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పావని, గ్రామ సంరక్షణ కార్యదర్శి వి.అనూష, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సుధామారుతి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్లో బాలబాలికలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. పోషక విలువలు మెండుగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీఓ సుశీలాదేవి

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



పూలసుబ్బయ్య కాలనీలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



ఎస్‌ఎస్ నగర్‌లో పూజలందుకుంటున్న సంతాన విఘ్నేశ్వర స్వామి

మార్కాపురం: గణేశ్ నవరాత్రుల సందర్భంగా మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలకు ఉభయదాతలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలసుబ్బయ్య కాలనీలో గణేష్ మండపం వద్ద కుంకుమ పూజ చేశారు. ఎస్ఎస్ నగర్‌లో సంతాన విఘ్నేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం చిన్నారులకు ఉట్టికొట్టే పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.

వినాయక లడ్డు రూ.54 వేలు



నాగులవరంలో వేలంలో దక్కించుకున్న లడ్డూతో ఊరేగింపు

బేస్తవారిపేట: అర్థవీడు మండలంలోని నాగులవరంలో ఏడు రోజులుగా పూజలందుకున్న గణనాథుడిని శుక్రవారం కంభం చెరువులో నిమజ్జనానికి తరలించారు. గణనాథుడి శోభాయాత్ర వైభవంగా సాగింది. వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన దండుగ స్వామిరంగారెడ్డి రూ.54 వేలకు దక్కించుకున్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం



హెచ్‌ఎం గురుస్వామికి నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొమరోలు: విజయవాడ వరద బాధితులకు మండలంలోని అల్లినగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాసటగా నిలిచారు. విద్యార్థులంతా కలిసి గ్రామంలో రూ.18,120 విరాళాలు సేకరించినట్లు హెచ్‌ఎం గురుస్వామి తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు మరో రూ.27,048 నగదు అందించగా.. మొత్తం 45,168 రూపాయలను శుక్రవారం డీఈఓ ఫోన్‌పేకు నగదు పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

చెరువును ఆక్రమిస్తే చర్యలు



చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మార్కాపురం: మార్కాపురం చెరువును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వై జంక్షన్ వద్ద చెరువు ఆక్రమణలను ఆయన పరిశీలించారు. పలువురు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఆక్రమిత స్థలాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

కంభం: కందులాపురం గ్రామంలో ఎస్సీపాలెం వాసులు, గ్రామస్తులు ఎన్నో సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్న రహదారిని గ్రామానికి చెందిన సూర్యరాజు ఆక్రమించాడని శుక్రవారం మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కల్వకూరి అబ్రహం స్థానిక మహిళలతో కలిసి తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలికి ఫిర్యాదు చేశారు. అధికారులు విచారించి చర్యలు తీసుకుని గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్ ఇంజినీర్ సుబ్బరాయుడు తెలిపారు. కోమటికుంట పరిధిలోని కోలభీమునిపాడు, నికరంపల్లి, చింతగుంట్ల, నాగులవరం, ఎల్‌బీఎస్ నగర్, తిప్పాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని తిప్పాయపాలెం, మాల్యవంతునిపాడు, మిట్టమీదిపల్లి, అలాగే యాచవరం సబ్ స్టేషన్ పరిధిలోని యాచవరం, మొద్దులపల్లి, నాయుడుపల్లి, మన్నంవారిపల్లి, బోడపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

పొదిలి రూరల్: మండలంలోని మల్లవరం, కంభాలపాడు, ఉప్పలపాడు, కాటూరివారిపాలెం పరిధిలోని సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అంకబాబు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

17 నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ డి.వెంకటదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాలు, బ్యూటిఫికేషన్, పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత, ప్లాంటేషన్ కార్యక్రమాలపై 15 రోజులపాటు ప్రజలను చైతన్యపరిచేందుకు వీధినాటకాలు, బుర్రకథలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలుకు చెందిన కిమ్స్ వైద్యశాల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గుండె, ఎముకలు, కంటి, మోకాళ్లు, లివర్, ప్రేగు, కీళ్ల వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత



మాట్లాడుతున్న నాగమల్లికార్జునరావు, పక్కన ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం టౌన్: సమాచార చట్టంతో ప్రభుత్వంలో పారదర్శకత పాలన, జవాబుదారి తనం ఉంటుందని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఈ చట్టం ద్వారా ప్రజలు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చన్నారు. విశ్రాంత తహసీల్దార్ నాగమల్లికార్జునరావు మాట్లాడుతూ చట్ట పరిధిలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రత్యక్షంగా పరోక్షంగా వాటి నుంచి నిధులు పొందుతున్న శాఖలు వస్తాయన్నారు. రేషన్ కార్డు ఉన్న వారికి సమాచారం ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



భారతిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: కెరీర్ గైడెన్స్ విభాగంలో రోటరీ క్లబ్ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ రేచల్ భారతిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు భారతి సేవలను కొనియాడారు.

మాజీ సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే కేపీ ఘన నివాళి



రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ

అర్థవీడు(బేస్తవారిపేట): అనారోగ్యంతో మృతి చెందిన అర్థవీడు మాజీ సర్పంచ్ మునగాల రామిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నివాళులర్పించినవారిలో ఎంపీపీ వెంకట్రావు, మాజీ ఎంపీపీ రవికుమార్‌యాదవ్, సర్పంచ్ మునగాల వసంతమ్మ, నాయకులు ఏరువ కృష్ణారెడ్డి, రంగారెడ్డి, రమేష్‌రెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

హలో మాల.. చలో ఒంగోలు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

మార్కాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 22న ఒంగోలులో నిర్వహిస్తున్న హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కె.అబ్రహాం కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని కోర్టు సెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. వాల్‌పోస్టర్లను సంఘ నాయకుడు నూతలపాటి రాజుతో కలిసి ఆవిష్కరించారు. అబ్రహాం మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీ క్రీమిలేయర్ చట్టాన్ని తీసుకురావడంతో దళితుల మధ్య విభేదాలు సృష్టించినట్టయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జీఓను వ్యతిరేకిస్తూ 1997 ఆగస్టు 11న లక్షలాది మంది మాలలు సచివాలయం ముట్టడించారని, పోలీసుల లాఠీచార్జిలో జి. నారాయణ, పి.శేషయ్య అమరులయ్యారన్నారు. న్యాయ పోరాటాల ద్వారా 2004 నవంబరు 5న వర్గీకరణ జీవోను కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మాలలందరూ ఏకతాటిపై వచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇజ్రాయేల్, చెల్లి రమణ, నూతలపాటి చెన్నకేశవులు, రామూ, శ్రీనివాసులు, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భాషను గౌరవించుకుందాం



విద్యార్థులకు బహుమతులిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్‌ఫరూఖ్



హిందీ పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, పక్కన ఉపాధ్యాయులు

కొమరోలు: జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కొమరోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ ఫరూఖ్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందీ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బ్యాంక్ మేనేజర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రేవతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

మార్కాపురం: పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రంగయ్య మాట్లాడుతూ రాజ్య భాష హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, తద్వారా దేశంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లినపుడు ఇబ్బందులు ఉండవన్నారు. హిందీ భాషపై భయం వీడాలని సూచించారు. హిందీ వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఏఓ కె.రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.